సాక్షి
అనంతపురం

బుధవారం, 25, అక్టోబర్, 2023



పంటల బీమా.. రైతుకు ధీమా

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. 8లో



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



గరిష్టం/కనిష్టం

37.9°/16.3°

జిల్లా అంతటా మంగళవారం వాతావరణం మారింది. పగలు ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుదల నమోద య్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది.

న్యూస్‌రీల్

28న వాల్మీకి జయంతి



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

అనంతపురం రూరల్: ఈ నెల 28న అనంతపురంలోని కేఎస్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి వారు పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని, ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని సూచించారు. తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి పాల్గొన్నారు.

27లోపు బయోమెట్రిక్ వివరాలు పంపాలి



అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించే మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను ఈ నెల 27లోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపకార వేతనాల కోసం ఉమ్మడి జిల్లాలో 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, వివిధ వృత్తి కోర్సుల మైనార్టీ విద్యార్థులు 7,006 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఇప్పటి వరకు 6,766 మంది వివరాలను మాత్రమే జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపారని పేర్కొన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను శుక్రవారం లోగా పంపితేనే స్కాలర్ షిప్ నగదు జమ అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు వీలైనంత తొందరగా విద్యార్థుల వివరాలను పంపించాలని సూచించారు.

నేడు పెద్దవడుగూరులో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: 'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి కార్యక్రమాన్ని బుధవారం పెద్దవడుగూరు మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. పెద్దవడుగూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'చంద్రబాబు కాళ్ల వద్ద జనసేన పార్టీ తాకట్టు'

తాడిపత్రి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు కాళ్ల వద్ద పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. సీఎం కుర్చీ కోసం రెండు పార్టీలూ పొత్తుల పేరుతో ఆరాట పడుతున్నాయని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలోని తన నివాసంలో మంగళవారం పైలా విలేకరులతో మాట్లాడారు. జనసేన – టీడీపీ పొత్తు అపవిత్రమైనదిగా అభివర్ణించారు. టీడీపీ పొత్తుతో ఆయన తన అభిమానులను, కాపులను, జనసేన కార్యకర్తలను నిలువునా మోసం చేసి చంద్రబాబు వద్ద పాలేరులుగా చేశారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో 24 ఎంపీ, 175 అసెంబ్లీ సీట్లు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం



అనంతపురం ఎడ్యుకేషన్: దసరా పండుగ సందర్భంగా ఈ నెల 14 నుంచి అన్ని యాజమాన్య పాఠశాలలకు ఇచ్చిన సెలవులు మంగళవారం ముగిశాయి. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులందరూ బడులకు వచ్చేలా చూడాలని డీఈఓ నాగరాజు ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లకు సూచించారు. కాగా గురువారం జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

ఆంధ్రా పోలీసులు ఆదర్శం



అనంతపురం పీటీసీలో సోమవారం జరిగిన ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్‌పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, చిత్రంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం,ఎస్పీలు అన్బురాజన్, మాధవరెడ్డి

- శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
- నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పిలుపు
- ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్‌పరేడ్

అనంతపురం క్రైం: ఆంధ్రప్రదేశ్ పోలీసుల సేవలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రశంసించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో 28 మంది ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ పూర్తయ్యింది. ఈ సందర్భంగా సోమవారం పీటీసీ ఆవరణలో ట్రైనీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హోం మంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. పీటీసీ ప్రిన్సిపాల్/ఐజీ వెంకట్రామిరెడ్డితో కలసి వారు ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం ప్రొబేషనరీ డీఎస్పీలతో ప్రిన్సిపాల్ రాజ్యాంగబద్ధ ప్రమాణం చేయించారు. డీఎస్పీలనుద్దేశించి హోంమంత్రి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో కేసుల విచారణ నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు కీలకమైన బాధ్యతలు డీఎస్పీలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయాలు అమలు చేస్తూనే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది చేత సమర్థవంతంగా పనిచేయించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ ప్రథమ కర్తవ్యంగా భావించి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని సూచించారు. డీఎస్పీ అంటే...డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అందరం పిలుస్తామని, ఇక నుంచి మీ పనితీరుతో 'డెడికేటెడ్ సక్సెస్ ఫుల్ పోలీస్'గా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. నేడు మన ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ దేశానికే అనేక విషయాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అద్భుతంగా ఉందన్నారు. ఇదంతా డీజీపీ నుంచి కిందిస్థాయి అధికారి, సిబ్బంది వరకు చిత్తశుద్ధితో పనిచేయడం వల్లనే సాధ్యమయ్యిందని కొనియాడారు. మహిళల భద్రత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ యాప్ ప్రవేశపెట్టి.. పోలీస్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. నూతన డీఎస్పీలు ఇదేస్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

పారదర్శకంగా పనిచేయండి

ఇగోయిజానికి పోకుండా, అందరినీ సమానంగా చూస్తూ పారదర్శకంగా సేవలందించాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నూతన డీఎస్పీలకు సూచించారు. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధుల్లో వ్యవహరించాలని డీఎస్పీలకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో గత ఏడాది 122 కీలక కేసుల దర్యాప్తుల పర్యవేక్షణను ఎస్పీలకు అప్పగించామన్నారు. ఈ కేసులన్నింటిలోను ముద్దాయిలకు శిక్షలు పడటం ముదావహమన్నారు. ఈ ఏడు కూడా ఎస్పీలకు 50 కేసులు అప్పగించగా ఇప్పటికే 30 వరకు కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, అవినీతి నిరోధక అప్లికేషన్‌లు ఉన్నాయని, వాటిని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా పోకడలను నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక టీంలు సిద్ధం చేశామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రేవ్ కేసుల దర్యాప్తులో నైపుణ్యం సాధించాలన్నారు. శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోం మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మేయర్ వసీం, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు కేకేఎన్ అన్బురాజన్, ఎస్వీ మాధవరెడ్డి, ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర రావు, అదనపు ఎస్పీలు జె.మల్లికార్జునవర్మ, ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు అల్లా బకాష్, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణ, దేవదాస్, బి.శ్రీనివాసులు, సీఎం గంగయ్య, నరసింగప్ప, నగర రిటైర్డ్ ఐజీ సూర్య ప్రకాష్, పలువురు సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



నూతన డీఎస్పీలతో సెల్ఫీ దిగుతున్న యువతి



హోంమంత్రి చేతుల మీదుగా కరవాలాన్ని అందుకుంటున్న జీవన్ ప్రశాంత్



లాఠీ అందుకుంటున్న గీతా కుమారి



చిన్నారితో నూతన మహిళా డీఎస్పీ



కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న నూతన డీఎస్పీ ఉషశ్రీ

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

- ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపు

పుట్లూరు: శింగనమల నియోజకవర్గంలో ఈ నెల 26న ప్రారంభం కానున్న సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయంగా ఆయా వర్గాలకు చేసిన మేలును ఈ బస్సుయాత్ర ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. బస్సు యాత్రకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రాజారెడ్డి, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీతమ్మ, పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు వెంకటరామిరెడ్డి, నాగభూషణం, ఓబులేసు, నాగార్జునరెడ్డి, మహేష్, రామాంజులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సామాజిక సాధికారిక బస్సుయాత్ర పోస్టర్లను పుట్లూరులో ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య తదితరులు విడుదల చేశారు.

బస్సుయాత్ర సభా స్థలాల పరిశీలన

శింగనమల/ బుక్కరాయసముద్రం: శింగనమల నుంచి సామాజిక సాధికారికబస్సుయాత్ర గురువారం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డితో కలిసి శింగనమల, బుక్కరాయసముద్రంలో బస్సు యాత్ర స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమలలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు దివంగత వైఎస్సార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ముందు భాగాన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీ సాగుతుందన్నారు. నాలుగు గంటలకు బుక్కరాయసముద్రంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, శింగనమల మండల కన్వీనర్ నగేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, సర్పంచ్‌లు వెంకటరాముడు పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు పూల నారాయణస్వామి, ముత్యాల శీనా, చికెన్ నారాయణస్వామి, చేపల రమణ, పురుషోత్తం, మల్లికార్జున, కొండన్న తదితరులు పాల్గొన్నారు.



బస్సుయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, పైలా, రాజారెడ్డి తదితరులు

బస్సు యాత్రకు ప్రముఖుల రాక

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయడానికి పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 26 నుంచి సామాజిక సాధికారిక పేరుతో బస్సు యాత్ర చేపట్టనున్నారు. గురువారం మధ్యాహ్నం శింగనమలలో బస్సు యాత్ర ప్రారంభమై, సాయంత్రం బుక్కరాయసముద్రంలో జరిగే బహిరంగ సభకు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ నందిగం సురేష్, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ హాజరవుతారు. జిల్లా నుంచి మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ తలారి రంగయ్య తదితరులు పాల్గొంటారు.

విజయవంతంగా 'ఆరోగ్య సురక్ష'

- ఇప్పటి వరకు జిల్లాలో 504 క్యాంపుల పూర్తి
- సేవలు పొందిన వారిలో మహిళలే అధికం

అనంతపురం మెడికల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. జిల్లాలోని నగరపాలక సంస్థ, ఆరు మునిసిపాలిటీలతో పాటు 31 మండలాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన వస్తోంది. వచ్చే నెలాఖరు వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరగనున్నాయి.

1,47,609 మందికి ఓపీ సేవలు

సెప్టెంబర్ 30 నుంచి జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 504 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. 1,47,609 మంది ఓపీ సేవలు పొందారు. అందులో 67,611 పురుషులు, 79,998 మంది మహిళలు ఉన్నారు. మహిళలే అత్యధికంగా వైద్య సేవలు పొందారు. 3,230 మందిని మెరుగైన వైద్యం కోసం జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు స్పెషలిస్టు వైద్యులు రెఫర్ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద 19,682 మంది సేవలు పొందారు. వీరిలో కంటి సమస్యలున్న వారికి త్వరలో అద్దాలు పంపిణీ చేయనున్నారు.

నేడు 8 చోట్ల వైద్య శిబిరాలు

జిల్లాలో బుధవారం ఎనిమిది చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. చెదుల్ల, దంచెర్ల, తిమ్మాపురం, కణేకల్లు, కల్లుమడి, బ్రాహ్మణపల్లి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, కళ్యాణదుర్గం ఇందిరమ్మ కాలనీ, తాడిపత్రి పాతకోట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ డాక్టర్ సుజాత కోరారు.

మార్మోగిన సాయినామం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. అశేష భక్తకోటితో సాయినామస్మరణ మార్మోగింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ పూర్ణచంద్ర ఆడిటోరియం వేదికగా చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం మంగళవారం పూర్ణాహుతితో ముగిసింది. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వేదపండితులు శ్రీమన్నారాయణ దంపతులు వేదమంత్రోచ్చారణ నడుమ యజ్ఞద్రవ్యాలను సమర్పిస్తూ సంప్రదాయ రీతిలో పూర్ణాహుతి గావించారు. పుణ్యజలాన్ని భక్తకోటిపై సంప్రోక్షణ గావించారు. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు.వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి ఇస్తున్న వేదపండితులు



అనంతపురం పాతూరు అమ్మవారి శాలలో లలితాదేవి అలంకరణ



అనంతపురంలోని కొత్తూరు అమ్మవారిశాలలో బారులు తీరిన భక్తులు

వైభవంగా విజయదశమి

జిల్లా అంతటా విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం మహర్నవి- దశమిని పురస్కరించుకుని ఆయుధపూజ, దసరా జరుపుకొన్నారు. గుమ్మాలకు మామిడి, పూల తోరణాలు కట్టి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలు చేసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ ఆనందంగా ఆరగించారు. సాయంత్రం ప్రజలు శమీవృక్ష దర్శనం చేసుకుని, జమ్మిపత్రిని పెద్దలకు అందించి ఆశీర్వాదం పొందారు. ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

- సాక్షి బృందం





కంబదూరులో రాతిదూలం లాగుడు పోటీలు, పుట్లూరు మండలం బాలాపురంలో దుర్గమ్మ ఊరేగింపు



ఆత్మకూరులో వాసవీమాత గ్రామోత్సవం



పామిడిలో అంబాభవాని, వాసవీమాత ఊరేగింపు

పంటల బీమా.. రైతుకు ధీమా

- వేరుశనగ హెక్టారుకు రూ.72,500 వర్తింపు
- ఎండు మిరపకు అధికంగా రూ.2 లక్షల పరిహారం
- దానిమ్మకు రూ.1.75 లక్షలు, చీనీకి రూ.1.25 లక్షలు
- తొలిసారి బీమాలో చేరిన ఆముదం పంటకు రూ.45 వేలు
- నాలుగేళ్లలో రూ.1,855 కోట్ల పరిహారం



అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అన్నదాతకు ఎనలేని ధీమా ఇస్తోంది. రైతులపై పైసా భారం పడకుండా నాలుగేళ్లుగా బీమా పథకం కింద అందించిన పరిహారమే అందుకు నిదర్శనం. వేరుశనగకు హెక్టారుకు రూ.72,500 వర్తించగా, ఎండుమిరపకు అధికంగా రూ.2లక్షల పరిహారం, దానిమ్మకు రూ.1.75లక్షలు, చీనీకి రూ.1.25లక్షలు పరిహారం వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో గత నాలుగేళ్ల కాలంలో 11.22 లక్షల మంది రైతులకు రూ.1,855 కోట్లు మేర భారీ ఎత్తున బీమా పరిహారంతో లబ్ధి చేకూర్చారు. ఈ క్రమంలో ఐదో ఏడాది కూడా 2023–24 ఖరీఫ్, రబీకి వాతావరణ బీమా, ఫసల్ బీమా పథకాలు అమలు చేస్తున్నట్లు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ–క్రాప్, ఈకేవైసీ, సామాజిక తనిఖీ ఆధారంగా నోటిఫై చేసిన పంటలకు బీమా వర్తింపజేశారు.

- అనంతపురం జిల్లాలో ఖరీఫ్ కింద వాతావరణ బీమా పథకంలో మండలం యూనిట్‌గా వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటాకు ఇచ్చారు. జిల్లాలో ఉన్న 214 ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్‌లో నమోదైన వర్షపాతం, ఉష్ణోగ్రతలు, ఇతరత్రా వాతావరణ గణాంకాల ఆధారంగా బీమా పరిహారం లెక్క వేయనున్నారు. ఇక ఫసల్ బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరపకు ఇచ్చారు. ప్రణాళికశాఖ నిర్వహించే పంటకోత ప్రయోగాలు, వాటి దిగుబడి ఆధారంగా ఈ పంటలకు బీమా పరిహారం లెక్కించనున్నారు.
- సత్యసాయి జిల్లా పరిధిలో ఖరీఫ్‌లో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటాకు వర్తింపజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 173 వెదర్ స్టేషన్లలో నమోదైన వాతావరణ గణాంకాలను పరిగణలోకి తీసుకుంటారు. ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, అలాగే జిల్లా యూనిట్ కింద ఆముదం, రాగి పంటలకు బీమా వర్తింపజేశారు.

రిస్క్ పీరియడ్స్: ఉమ్మడి జిల్లా పరిధిలో వాతావరణ బీమా కాలవ్యవధి (రిస్క్ పీరియడ్స్) తీసుకుంటే వేరుశనగకు జూలై 16 నుంచి అక్టోబర్ 31 వరకు నిర్ణయించారు. పత్తికి జూలై 1 నుంచి నవంబర్ 30 వరకు గుర్తించారు. చీనీ, దానిమ్మ, టమాట పంటలకు జూలై 1 నుంచి 2024 మే 31 వరకు నిర్ణయించారు.

పంటల వారీగా బీమా పరిహారం..

ఉమ్మడి జిల్లా పరిధిలో వాతావరణ బీమా పథకంలో వేరుశనగ పంట హెక్టారుకు రూ.72,500, పత్తికి రూ.90 వేలు, దానిమ్మకు రూ.1.75 లక్షలు, చీనీకి రూ.1.25 లక్షలు, టమాటాకు రూ.80 వేలు వర్తింపజేశారు. ఫసల్‌బీమా కింద కంది హెక్టారుకు రూ.45 వేలు, వరికి రూ.97,500, జొన్నకు రూ.50 వేలు, మొక్కజొన్నకు రూ.80 వేలు, ఎండు మిరపకు రూ.2 లక్షలు, రాగికి రూ.45 వేలు, మొట్టమొదటిసారిగా బీమా పథకంలో నోటిఫై చేసిన ఆముదం పంటకు అనంతపురం జిల్లాలో హెక్టారుకు రూ.45 వేలు, సత్యసాయి జిల్లాలో రూ.40 వేలు పరిహారం ఖరారు చేశారు.

పరిహార లెక్కింపు ఇలా..

వేరుశనగ పంటకు తక్కువ వర్షపాత పరిమాణం (డెఫిసియల్ రెయిన్‌ఫాల్ వాల్యూమ్) కింద జూలై 16 నుంచి అక్టోబర్ 10 వరకు వర్షపాతం వివరాలు పరిగణలోకి తీసుకుంటారు. డెఫిషియల్ రెయిన్‌ఫాల్ డిస్ట్రిబ్యూషన్ కింద జూలై 16 నుంచి సెప్టెంబర్ 5 వరకు వివరాలు తీసుకుంటారు. చీడపీడల వాతావరణం సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10 వరకు తీసుకుంటారు. అధిక వర్షపాతం (ఎక్సెస్ రెయిన్‌ఫాల్) సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు వివరాలు తీసుకుంటారు. ఇలా నాలుగు కేటగిరీల ఆధారంగా బీమా పరిహారం లెక్క వేయనున్నారు. ఇలాగే అన్ని పంటలకు మూడు నుంచి నాలుగు కేటగిరీలను ప్రామాణికం చేశారు. ఉద్యాన పంటలకు మార్చి, ఏప్రిల్ నెలలో అధిక ఉష్ణోగ్రతలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. ఇక ఫసల్ బీమా పంటలకు అయితే పంట దిగుబడుల ఆధారంగా బీమా పరిహారం లెక్క వేయనున్నారు.

క్లుప్తంగా

సత్తాచాటిన జిల్లా వృషభాలు



బండలాగుతున్న వృషభాలు

రాచర్ల: ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడులో జరిగిన బండ లాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా వృషభాల సత్తా చాటాయి. శిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర స్థాయి రెండు పళ్ల వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 13 జతల వృషభాలు పాల్గొనగా అనంతపురానికి చెందిన బి.భావన వృషభాలు నిర్ణీత 20 నిమిషాల్లో 3,250 అడుగుల దూరం రాతి దూలాన్ని లాగి మొదటి బహుమతి సాధించాయి. వైఎస్సార్ జిల్లా నల్లగుండుపల్లి గ్రామానికి చెందిన వల్లూరి రవీంద్రారెడ్డి వృషభాలు రెండో బహుమతి, ప్రకాశం జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి వృషభాలు మూడో బహుమతి గెలుచుకున్నాయి. యజమానులను నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

జామ తోటకు నిప్పు

బెళుగుప్ప: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి జామ తోట దగ్ధమైంది. వివరాలు.. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన రైతు హనుమంతరాయుడు తనకున్న 13 ఎకరాల్లో మూడేళ్ల క్రితం 20 వేల జామ మొక్కలు నాటారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. సోమవారం ఉదయం పండుగ పూట అందరూ గ్రామంలోనే ఉండిపోయారు. ఆ సమయంలో నిప్పు రాజుకుని తోటను చుట్టుముట్టింది. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడుతుండడం గమనించిన గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునే లోపు జామచెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, కొబ్బరి మొక్కలు కాలిపోయాయి. ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, చోరీకి వినియోగించే పరికరాలు చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి, రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సీసీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను అనంతపురం సీసీఎస్, పెద్దపప్పూరు పోలీసులు వెల్లడించారు. యాడికి నివాసి సరప్ భాస్కరాచారి విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి మకాం మార్చి కూలీ పనులతో జీవనం సాగించేవాడు. ఒంటరి జీవనానికి అలవాటు పడిన భాస్కరాచారి మద్యం, చెడు అలవాట్లకు బానిసయ్యాడు. కూలీ పనులతో వచ్చే ఆదాయం అతని అవసరాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. 13 ఏళ్లుగా చోరీలు చేస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యాడు. తాళం వేసిన గృహాలు, ఆలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడు. గుత్తి, కసాపురం, విడపనకలు, గుంతకల్లు, కర్నూలు జిల్లా పత్తికొండ, తుగ్గలి పోలీసు స్టేషన్లలో 11 చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 22న పెద్దపప్పూరు మండలం జూటూరు శివారులో అనుమానాస్పదంగా తచ్చాడుతుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో చోరీలు వెలుగు చూశాయి. రూ. 8 లక్షలు విలువ చేసే బంగారు నగలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, యాడికి సీఐ శంకరరెడ్డి, పెద్దపప్పూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు లేఖ బూటకం

- ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్లేలా కుట్ర
- విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జైలు నుంచి రాసినట్లుగా వైరల్ అవుతున్న లేఖ బూటకమేనని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్లేలా పెత్తందార్లు చేసిన కుట్రలో ఇది ఓ భాగమేనని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బాబు పేరిట విడుదలైన లేఖపై డీజీపీ విచారణకు ఆదేశించారని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తమూ నిజాలు వెలుగు చూడకుండా తొక్కిపెట్టేందుకే సరిపోయిందన్నారు. ఇన్నేళ్ల పాపం పండి చివరకు అతనిపై నిజం విజయం సాధించిందన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర ప్రారంభించే ముందు తన నారాసురిడి రక్తదాహం కూడా తెలుసుకోవాలని హితవుపలికారు. సీఎం కుర్చీ కోసం కన్నతండ్రిని వెన్నుపోటు పొడిచినప్పుడు లేని బాధ భర్తను జైల్లో పెట్టేసరికి బయటపడిందా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను చెప్పులతో చంద్రబాబు కొట్టించినప్పుడు... కరోనా విపత్తులో వేలాది మంది చనిపోయినా బయటకు రాని భువనేశ్వరి.. నేడు ప్రజాధనం దోపిడీ కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కోసం యాత్రల పేరిట డ్రామాలకు తెరతీయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పుత్రుడు, దత్తపుత్రుడు... ఎందరు కలిసినా 2024 ఎన్నికల తర్వాత కనుమరుగు కావడం ఖాయమన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు మార్గం సుగమమైందన్నారు.

దోపిడీ దొంగ కాలవ

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని విప్ కాపు విమర్శించారు. ఇంకుడు గుంతలపై కాలవ తెరతీసిన సెల్ఫీ డ్రామాలపై మండిపడ్డారు. కాలవ మంత్రిగా ఉన్నప్పుడు ఇంకుడు గుంతలు, నీరు–చెట్టు, ఎలుకపట్టు రూ.వెయ్యి పట్టు, దోమలపై దండయాత్ర లాంటి కార్యక్రమాలు చేపట్టి రూ.వేల కోట్లను సొంత ఖజానాకు మళ్లించుకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. ఐదేళ్ల టీడీపీ హయాంలో, ప్రస్తుత వైఎస్సార్ సీపీ హయాంలో రాయదుర్గం ఎంత మేర అభివృద్ధి చేసిందో లెక్కలతో సహా నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. న్యాయం గెలవాలంటే ఈ దొంగలందరికీ శిక్షపడాలన్నారు.

ఇంట్లో చొరబడి విందు.. ఆపై లూటీ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి విందు చేసుకుని ఆపై సమస్త వస్తువులనూ దోచుకెళ్లిన ఘటన పుట్టపర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తిలోని సత్యసాయి ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న తిరుపాలమ్మ స్థానిక చిన్నపల్లి హైస్కూల్ సమీపంలో నివాసముంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుటుంబసభ్యులను తీసుకుని ఇంటికి తాళం వేసి నెల క్రితం ఆమె బెంగళూరుకు వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు బద్దలుగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు, కొళాయిలు, మోటారు, ఇతర సామగ్రి మొత్తం లూటీ చేసినట్లు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఏఎస్‌ఐ గంగన్న, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంట్లోకి చొరబడిన తర్వాత అక్కడే గంటల పాటు సేదతీరినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మద్యం సేవించి, విందు చేసుకున్నట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. అనంతరం మద్యం మత్తు దిగేంతవరకూ అక్కడే సేదతీరి ఆ తర్వాత ఇంటి మొత్తాన్ని లూటీ చేసుకెళ్లినట్లుగా నిర్ధారించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రిపబ్లిక్ డే ప్రాబబుల్స్‌కు 65 మంది క్యాడెట్లు

- 27 నుంచి సికింద్రాబాద్‌లో పోటీలు



శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: న్యూఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలో కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్‌లో 65 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. క్యాంప్‌లో ఎన్‌సీసీ అధికారులు ఎస్‌ఎం కేకే సింగ్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 27న సికింద్రాబాద్ వేదికగా జరిగే పోటీలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ మంగళవారం తెలిపారు. నవంబర్ 5 వరకూ జరిగే ఈ పోటీలకు 9 ట్రూపులు పాల్గొంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి డిసెంబర్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

జిల్లాకు 3,200 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు ఒకే రోజు 3,200 మెట్రిక్ టన్నుల యూరియా అందింది. ఈ మేరకు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న యూరియా బస్తాలను పరిశీలించారు. రబీ ఎరువుల ప్రణాళికలో భాగంగా కోరమాండల్ కంపెనీ నుంచి యూరియా వచ్చిందన్నారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఆర్బీకేలు, సొసైటీలు, తర్వాత ఇండెంట్ మేరకు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన స్టాక్‌ను మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా - బాలుడి మృతి



మృతుడు సురేంద్ర

గుత్తి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన సురేంద్ర (13)ని వెంటబెట్టుకుని అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు చెరువు తండా గ్రామానికి వెళ్లాడు. టమాట పంట లోడు చేసుకుని తిరిగి ఎర్రగుడికి బయలుదేరిన వారు చెరువు తండా శివారులోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు, సురేంద్రను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం తిరిగి గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి తుగ్గలి పోలీసులకు బదిలీ చేశారు.

బంకును ఢీకొన్న బైక్ - యువకుడి మృతి



మృతుడు గోపాల్

కళ్యాణదుర్గం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి బంకును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ (20), శ్రావణ్, బాబు, మహమ్మద్ వ్యక్తిగత పనులపై సోమవారం కళ్యాణదుర్గం వచ్చారు. పని ముగించుకున్న అనంతరం నలుగురూ ఒకే ద్విచక్ర వాహనంపై రాత్రి 10 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. గరుడాపురం వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న తలారి ఈరన్న బంకును ఢీ కొని లోపలకు చొచ్చుకుపోయారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి చూశారు. బంకు లోపలకు చొచ్చుకుపోయిన ద్విచక్ర వాహనాన్ని గమనించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ఒక్కొక్కరిని వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, తలకు బలమైన గాయమైన గోపాల్ (ద్విచక్ర వాహనం నడిపిన యువకుడు) చికిత్సకు స్పందించక మంగళవారం ఉదయం మృతి చెందాడు. గోపాల్ తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వం.. రథోత్సవం

బెళుగుప్ప: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం బూదిగుమ్మలో వెలసిన పద్మావతీ సమేత వేంకటరమణస్వామి ఆలయంలో సోమవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారిని మహిసాసురమర్ధిని అలంకరణ చేశారు. వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు, అలంకరణలు జరిగాయి. అనంతరం ప్రధాన అర్చకుడు వాసుదేవస్వామి నేతృత్వంలో పల్లకీసేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథంపైకి చేర్చి పూజల అనంతరం గోవింద నామ స్మరణతో భక్తులు లాగారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుమ్మెత మమత, త్రిలోక్‌రెడ్డి దంపతులు, గ్రామ సర్పంచ్ రామకృష్ణమ్మ, కేశవరెడ్డి దంపతులు, ఎంపీటీసీ వీరబొమ్మన్న, ఆలయాల కమిటీ చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, సేవాకమిటీ జయేంద్రశర్మ, గోవిందరెడ్డి, జి.కేశవరెడ్డి, దేవాదాయశాఖ అధికారి అక్కిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎంజీ మోటార్స్ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్: వందేళ్ల చరిత్ర కలిగిన బ్రిటీష్ కంపెనీ ఎంజీ మోటార్స్ షోరూంను అనంతపురంలోని జాతీయ రహదారిలో ఏర్పాటు చేశారు. మంగళవారం షోరూం అధినేత ఉదయ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎంజీ మోటార్స్ డిప్యూటీ ఎండీ గౌరవ్‌గుప్తా తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంజీ కంపెనీలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో షోరూంలు ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఫీచర్స్ గల ఎంజీ ఆస్టర్, హెక్టార్, గ్లోస్టర్ మోడల్ వాహనాలతో పాటు విద్యుత్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై చింతల రాయుడి విహారం



దేవేరులతో కలసి చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న చింతల వెంకటరమణస్వామి

తాడిపత్రి అర్బన్: స్థానిక చింతల వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారు ఊరేగారు. భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించారు. పురవీధులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.

హాకీ బాలికల టోర్నీ విజేత 'ఏపీ'

- రాణించిన జిల్లా క్రీడాకారిణులు



విజయోత్సాహంతో మైదానాన్ని చుట్టి వస్తున్న క్రీడాకారులు

అనంతపురం: హాకీ ఇండియా సబ్ జూనియర్ బాలికల సౌత్ జోన్ చాంపియన్‌షిప్–2023ను ఏపీ జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన ఆర్డీటీ క్రీడాకారులే ఎక్కువగా ఉండడం గమనార్హం. చెన్నైలోని మేయర్ రాధాకృష్ణ ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు జట్టుతో తలపడిన ఏపీ జట్టు 5–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. జట్టులో శ్రీవిద్య మూడు గోల్స్, ముజీయాబేగం, తులసి చెరో గోల్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శ్రీవిద్య నిలిచారు. జట్టు విజయంపై ఏపీ ఆర్కిటెక్చర్ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చాణక్యరాజ్, సెక్రెటరీ హర్షవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, ఏపీ ట్రెజరర్ థామస్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్, టీం మేనేజర్ అనిల్‌కుమార్, కోచ్ ఆర్.దేవకి హర్షం వ్యక్తం చేశారు.

కర్మాగారంలో కార్మికుడి మృతి



మనోజ్‌కుమార్(ఫైల్)

బొమ్మనహాళ్: కర్మాగారంలో పనిచేస్తూ తీవ్రంగా గాయపడిన ఓ కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన టి.మనోజ్‌కుమార్ (32) కొంత కాలం క్రితం బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ సావ్ కర్మాగారంలో పవర్ ప్లాంట్ బాయిలర్ ఆపరేటర్‌గా విధుల్లో చేరాడు. మంగళవారం ఉదయం కర్మాగారంలో పనిచేస్తుండగా కన్వేయర్ బెల్ట్ తగులుకొని కుడి కాలు తొడ వరకూ తెగిపడింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే యంత్రాలను ఆపి క్షతగాత్రుడిని బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం క్రైం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి కాలనీకి చెందిన డి.మారుతీకిషోర్ (35) రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించేవాడు. ఈ క్రమంలో అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఓ కార్యాలయాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నాడు. వ్యాపార లావాదేవీల్లో అవసరాలకు మించి అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక కొంత కాలంగా మనో వేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలోనే సోమవారం తన కార్యాలయానికి చేరుకున్న ఆయన తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 7 గంటలకు కొందరు మిత్రులు కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ముందు తన తల్లితో పాటు భార్యకు రాసి పెట్టిన లేఖను స్వాధీనం చేసుకున్నారు. 'ఎవరు బాధపడొద్దు...ఆర్థిక ఇబ్బందులు భరించలేక చనిపోతున్నా' అంటూ అందులో రాసి ఉన్నట్లుగా తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

క్లుప్తంగా

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కొత్తకోట సుంకులమ్మ

అనంతపురం అర్బన్: విజయదశమి పండుగ పురస్కరించుకుని సోమవారం పాతూరు చెరువుకట్ట మీద ఉన్న కొత్తకోట సుంకులమ్మ అమ్మవారికి పూజారమ్మ బెస్త వరలక్ష్మి ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

నేటి నుంచి ఎగ్జిబిషన్

అనంతపురం రూరల్: చేనేత, ఖాదీ ఉత్పత్తులు, హస్తకళాకారులను ప్రోత్సహించే లక్ష్యంగా భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ, హస్తకళా సేవా కేంద్రం (తిరుపతి) ఆధ్వర్యంలో శిల్పారామంలో బుధవారం నుంచి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల కళాకారులు తమ ఖాదీ ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ఏడు రోజుల పాటు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7.30 వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: దసరా పండుగను పురస్కరించుకుని తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్‌లో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు మేయర్ వసీం సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ కార్మికుల సేవలు వెలకట్టలేనివని, అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

29న సాహితీ సదస్సు

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'కామ్రేడ్ కలేకూరి జీవితం-సాహిత్యం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జిరసం అధ్యక్ష కార్యదర్శులు జెన్నే ఆనంద్‌కుమార్, కొత్తపల్లి సురేష్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రముఖ కవి కత్తి కల్యాణ్ ప్రధాన వక్తగా పాల్గొంటున్నారని, సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

హోంమంత్రికి తేనీటి విందు



పూజలందుకున్న షిరిడీ సాయినాథుడు

అనంతపురం కార్పొరేషన్: హోంమంత్రి తానేటి వనితకు ఎంపీ గోరంట్ల మాధవ్ తేనీటి విందు ఇచ్చారు. జిల్లాకు విచ్చేసిన హోం మంత్రి తానేటి వనిత సోమవారం నగరంలోని ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటికి వెళ్లారు. ఎంపీ మాధవ్ దంపతులు హోంమంత్రికి స్వాగతం పలికారు. ఆమె వెంట ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీల పాసింగ్ అవుట్‌పరేడ్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అనంతపురం విచ్చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్రా వెంకటేష్ సోమవారం హోం మంత్రి బస చేసిన హోటల్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

నేత్రపర్వం.. చక్రస్నానం



చందన అలంకారంలో సతీసమేత శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 10 రోజులుగా సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం చక్రస్నానంతో ఘనంగా ముగిశాయి. ఉదయం ధ్వజావరోహణం, చక్రస్నానం, వసంతోత్సవం, శయనోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా శ్రీవారి బ్రహ్మ రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, అర్చకులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• హౌసింగుబోర్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించినన హోమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామ్‌నగర్, శ్రీనివాసనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలలో బ్రహ్మోత్సవ ముగింపు వేడుకలు కమనీయంగా సాగాయి.

సంబరంగా దసరా



పంపనూరులో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



సర్వాలంకారంలో ముత్యాలమ్మ



అలంకరణలో వాసవీ మాత



పూజలందుకున్న రామ లింగేశ్వర చౌడేశ్వరీదేవి



మహిషాసురమర్దినిగా అమ్మవారు



రాప్తాడులో పూజలందుకుంటున్న పార్వతీదేవి

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఊరంతా సందడిగా మారింది. ప్రతి లోగిలిలో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం దసరాతో ఘనంగా ముగిశాయి. మొదటి రోడ్డులోని రామలింగేశ్వర చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ముత్యాలతో అలంకరించి పూజలు చేశారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఆలయాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. జిల్లా జడ్జి శోభారాణి కొత్తూరులో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ నిర్వాహకులు గోపామచ్చానరసింహులు తదితరులున్నారు.

• హెచ్చెల్సీ కాలనీ శ్రీనసనకోట ముత్యాలమ్మ, చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానం పీఠం, శ్రీశివ బాలయోగి ఆశ్రమం, శివకోటి, శారదాశంకరమఠం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, ఐదో రోడ్డు సుంకలమ్మ, పెద్దమ్మ వార్ల ఆలయాల్లో పండుగ వాతావరణం వెల్లివిరిసింది.

రాప్తాడు/ కనగానపల్లి/ ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గంలో దసరాను సంబరంగా జరుపుకొన్నారు. రాప్తాడులోని పండమేటి వేంకటరమణ స్వామి, నీలకంఠేశ్వరస్వామి, మారేమ్మ, పెద్దమ్మ, మరిగమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యవారిపల్లి ఎర్రిస్వామి దేవాలయం, మరూరు చిన్న కదిరయ్య స్వామి, హంపాపురం మౌనగిరి క్షేత్ర అభయాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

• కనగానపల్లి, తగరకుంట, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లోని సల్లాపురప్ప, పెద్దమ్మ, మారెమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేపకుంట, తగరకుంట, తూంచర్ల ప్రజలు జమ్మి చెట్లకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. పలుచోట్ల గంగమ్మ, దుర్గమ్మ దేవతలను ఊరేగించారు. ఆత్మకూరులోని వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని వివిధ ఆపరేషన్ థియేటర్లలో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హెచ్ఓడీలు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ ఆత్మారాం, పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూపరింటెండెంట్ ఆదేశించారు.

● సందడే సందడి..





డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం శిల్పారామంలో సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నగరవాసులతో కోలాహలం కనిపించింది. మురళి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



కొత్తూరులో శయనోత్సవంలో సేదతీరుతున్న అమ్మవారు



రాప్తాడులో పూజలు అందుకున్న మరిగమ్మ



గొందిరెడ్డిపల్లిలో ఉజ్జినేశ్వరస్వామి



కనగానపల్లిలో ప్రత్యేక అలంకరణలో మారెమ్మ



మామిళ్లపల్లిలో పూజలందుకున్న పెద్దమ్మ తల్లి



కొత్తూరు అమ్మవారిశాలలో జిల్లా జడ్జిని సత్కరిస్తున్న నిర్వాహకులు



శ్రీశివబాలయోగి ఆశ్రమంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

రాప్తాడురూరల్: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలోని కరణం కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన 'చియ్యేడు బళ్లారి దుర్గమ్మ దసరా క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-1' ఫైనల్ మ్యాచ్ సోమవారం జరిగింది. విజేతగా బ్యాంక్ బ్లాస్టర్స్ టీం, రన్నర్స్‌గా తగ్గులేరు టీం నిలిచింది. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం చేశారు. మొత్తం ఆరు జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. అన్ని టీమ్‌లకు కప్‌లు, ప్లేయర్స్‌కు మెడల్స్ ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. టోర్నీ నిర్వహించిన కరణం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చెన్నయ్య, మండల వ్యవసాయ సలహా మండలి మెంబరు రవీంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చలపతి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ సభ్యుడు సునీల్‌దత్త రెడ్డి, సర్పంచ్ గురుప్రసాద్, ఉప్పరపల్లి సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సి.నరసింహారెడ్డి (81) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. సమాచారం అందుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని నరసింహారెడ్డి భౌతికా కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరసింహారెడ్డి కుటుబ సభ్యులతో మాట్లాడారు. ఆయన కుంటుంబానికి అని విధాలుగా తోపుదుర్తి కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృషారెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా మహాసమాధి వేడుకలు



ప్రత్యేక అలంకణలో సాయినాథుడు



పూజల్లో పాల్గొన్న బాబా భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు బాబా మందిరాలలో శ్రీషిరిడి సాయిబాబా మహాసమాధి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మహాసమాధి పొంది 105 ఏళ్లయిన సందర్భంగా 105 దీపాలు వెలిగించారు. స్థానిక వేమనా టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శ్రీషిరిడిసాయిబాబా మందిరంలో విశేష అలంకార సేవలు, ప్రసాద వితరణ జరిగింది. భక్తులు బారులు తీరి బాబా ప్రతిమను తాకి పూజలాచరించారు. 3వ రోడ్డు, పాతూరు చెరువుకట్ట, రామచాంద్రానగర్, వేణుగోపాలనగర్, తపోవనం శ్రీశివశక్తి బాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా వశికేరప్ప బ్రహ్మోత్సవాలు

రాప్తాడు: మరూరులో వశికేరప్పస్వామి విజయదశమి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. వశికేరప్పస్వామి ట్రస్ట్ చైర్మన్ బుడగ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కుల గురువులు, గుడికట్టు పిన్న పెద్దలు, పూజారులు, కాపులు కలసి భక్తి శ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం వద్ద వెండి గుర్రంపై ప్రారంభమైన స్వామి ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది. ముందు భాగాన ప్రజలు నీళ్ల చల్లుకుంటూ టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలోని జమ్మి వృక్షం వరకు స్వామి వారిని ఊరేగించారు. వివిధ రాష్ట్రాల కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రత్యేక పూజలు

మరూరులో పల్లెలప్ప, గొల్లపల్లిలో గొల్లపల్లయ్య స్వాములకు కాపులు, భక్తులు విజయదశమి పండగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆయా స్వాములను కాపులు 44వ జాతీయ రహదారి టోల్ ప్లాజా దగ్గరకు తీసుకొచ్చి మెరిమణితో ఊరేగించారు.



వశికేరప్ప ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



గొల్లపల్లయ్య స్వామి ఉరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ మాధవ్

ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

వశికేరప్ప, పల్లెలప్ప, గొల్లపల్లయ్య విజయదశమి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి, నసనకోట ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీధి వ్యాపారులపై వేధింపులు ఆపాలి

అనంతపురం అర్బన్: వీధి వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నడిమివంక వద్ద సంఘం ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గేట్ పేరుతో నగర పాలక సంస్థ ఒక్కో వీధి వ్యాపారి నుంచి రోజూ రూ.20 వసూలు చేస్తోందన్నారు. ఇందులో 50 శాతం వారి అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. వీధి వ్యాపారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి జామీను లేకుండా 'ముద్రా' రుణాలు ఇవ్వాలన్నారు. వీధి వ్యాపారుల చట్టాన్ని అమలు చేసి వారి హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నాయకులు కృష్ణుడు, రాజు, నగప్ప, రఫి, చలపతి, రాములమ్మ, రుక్మిణమ్మ, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర జయప్రదం చేద్దాం

రాప్తాడురూరల్: వైఎస్సార్ సీపీ ఈనెల 26 నుంచి చేపట్టనున్న 'సామాజిక సాధికారిక బస్సు యాత్ర'ను జయప్రదం చేసి, బహుజన వెలుగు యాత్రగా ప్రపంచానికి చాటుదాం అని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ బహుజనులను ముందు వరుసలో నిలబెట్టి వారి ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసి, రాష్ట్రంలో ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. నాలుగేళ్లలోనే బహుజన సమాజంలో మార్పులు తెచ్చిన జగన్ రెండోసారి అధికారంలోకి వస్తే బహుజనుల స్థితిగతులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చని స్పష్టం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. 108 శివలిం గాలకు మొక్కుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మొక్కల మాటున మెక్కేశారు!



టెండర్‌లో చూపినట్లుగా కాకుండా చిన్న సైజు మొక్క నాటిన దృశ్యం



ఎన్‌టీఆర్ మార్గ్‌లో ఆకులను ఆవులు తినేయడంతో బోసిగా కన్పిస్తున్న మొక్కలు

- ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం
- కాంట్రాక్టర్‌తో కలిసి పన్నాగం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను తుంగలోకి తొక్కుతున్నారు. రూ.వేలు విలువ చేసే మొక్కలను టెండర్‌లో నమోదు చేసినా.. గుట్టుచప్పుడు కాకుండా కాంట్రాక్టర్‌తో తక్కువ ధర మొక్కలు నాటించారు. ఇంజినీరింగ్ విభాగంలోని ఇద్దరు అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతు నడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ సంగతి..

జగనన్న హరిత నగరాల్లో భాగంగా నగరంలోని ఎన్‌టీఆర్ మార్గ్, జేఎన్‌టీయూ, తదితర ప్రాంతాల్లోని డివైడర్ల మధ్యలో ఖరీదైన మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందుకోసం సాధారణ నిధులు రూ.61 లక్షలు, రూ.16.2 లక్షలు, రూ.10 లక్షలతో గతేడాది నవంబర్‌లో టెండర్లు ఆహ్వానించారు. రూ.10,000 విలువ చేసే ఫోయినెక్స్ సిల్వెస్ట్రిస్ మొక్కలు 136 ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆ మేరకు నెల క్రితం ఎన్‌టీఆర్ మార్గ్‌లో రూ.10 లక్షల ఖర్చు చూపి ఫోయినెక్స్ సిల్వెస్ట్రిస్ మొక్కలను నాటారు. అయితే, టెండర్‌లో కోడ్ చేసిన మొక్కలకంటే తక్కువ సైజు వాటిని కాంట్రాక్టర్ నాటించాడు. చిన్న మొక్కలు 143, పెద్దవి 80 వరకూ నాటారు. చిన్న మొక్క విలువ రూ.1600, కాస్త పెద్ద సైజు మొక్క విలువ రూ.2700 ఉంటుందని అధికారులు చెబుతున్నా.. ఆయా ప్రాంతాల్లో నాటిన వాటి విలువ మార్కెట్‌లో చాలా తక్కువ అని విశ్వసనీయంగా తెలిసింది.

గుట్టుచప్పుడు కాకుండా..

మొక్కలు నాటే సమయంలో ఎటువంటి మొక్కలు నాటుతున్నారు? పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టాలన్న ఆలోచన లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అధికారులు మొక్కలు నాటించారు. కనీసం వాటిని పరిరక్షించడంలో ఎటువంటి కంచెలను అధికారులు ఏర్పాటు చేయలేదు. ఆ మొక్కలపై భాగంలోని ఆకులను ఆవులు తినేశాయి. రూ.లక్షలు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనుల పట్ల ఇంజినీరింగ్ అధికారులకు కనీసం ముందుచూపు లేకుండా వ్యవహరించారు. ఇదే విషయమై కమిషనర్ భాగ్యలక్ష్మిని ఆరా తీయగా ప్రస్తుతం నాటిన మొక్కలు అధిక ధర చేయవని, మార్కెట్ ధర ప్రకారమే నాటిన మొక్కలకు ధర చెల్లిస్తామని, వాటి స్థానంలో వేరే వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామగిరి మాజీ జెడ్పీటీసీ సభ్యుడిపై కేసు

రామగిరి: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలానికి చెందిన టీడీపీ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామ్మూర్తి నాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జనార్దన్‌నాయుడు మంగళవారం తెలిపారు. సోమవారం గంగంపల్లిలోని రహదారిలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలలు వేసి రోడ్డుపై దహనం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఆయనతోపాటు గంగాధర్, మహేంద్ర, అశోక్, నాగరాజు, వన్నూరప్ప, చౌడప్ప, ముత్యాలప్పలపైనా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.